సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 2 ఫిబ్రవరి । 2025



సోమశిలలో 67.870 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం 67.870 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 3950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.85,280
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,745
3 శాతం జీఎస్టీతో	రూ.7,977
నవర (8 గ్రా)	రూ.63,816



వాతావరణం

ఆదివారం జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 69 శాతంగా నమోదైంది.



సభలో మాట్లాడుతున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఎ బేబి, వేదికపై నాయకులు

వ్యవసాయ రంగానికి కేంద్రం ఉరి

రోజుకు 34 మంది రైతుల ఆత్మహత్యలు

- ఆకలి చావుల్లో టాప్ 127 దేశాల్లో భారత్‌ది 106వ స్థానం
- అదానీ, అంబానీల ప్రయోజనాలే కేంద్రం లక్ష్యం
- రాష్ట్రానికి ప్రధాని మోదీ మొండి చేయి
- చంద్రబాబు, పవన్ ఎందుకు ప్రశ్నించడం లేదు
- విజన్ 2047 అంటూ ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు
- సీపీఎం రాష్ట్ర మహాసభలో ధ్వజమెత్తిన వక్తలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు గతేడాది కంటే తగ్గించారు. వ్యవసాయ రంగాన్ని వదిలేసి కార్పొరేట్ శక్తులు అదానీ, అంబానీల ప్రయోజనాల కోసమే బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించినట్లు ఈ బడ్జెట్ ఉంది. జాతీయ నేరాల బ్యూరో అందించిన రిపోర్టు ప్రకారం దేశంలో 2017 నుంచి 2022 వరకు 1,00,474 మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ లెక్కన రోజుకు సగటున 34 మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ ఆత్మహత్యలకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని, దీనికి పూర్తి బాధ్యత కేంద్రం, ప్రధాని మోదీ, అమిత్ షా, నిర్మలాసీతారామన్ వహించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తోందని, 21 మంది ఎంపీల బలమున్న రాష్ట్రానికి ఈ బడ్జెట్‌లో ఏ విధంగానూ కేటాయింపులు లేవన్నారు. రాష్ట్రంలో బీజేపీతో కలిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన నాయకులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మోదీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్స్‌లోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో శనివారం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ అధ్యక్షతన సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంఎ బేబి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, దళితులు, గిరిజనులు, రైతులకు వ్యతిరేకంగా ఉందన్నారు. ప్రపంచంలో ఆకలి చావులు, మూడు పూటలు తిండికి నోచుకోని ప్రజలు ఉన్న 127 దేశాల జాబితాలో భారత్ 106వ స్థానంలో ఉందన్నారు.

సైద్ధాంతిక విభేదాలు కావు, రాజకీయ విభేదాలే

– కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

సీపీఎం రాష్ట్ర 27వ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం విశాఖలో జరిగిన సీపీఐ సమావేశాల్లో నేడు బేబి చెప్పిన అంశాలు, విషయాలపై తాము చర్చించడం జరిగిందన్నారు. సీపీఎం, సీపీఐ మధ్య సైద్ధాంతిక విభేదాలు లేవని, రాజకీయ విభేదాలనే అన్నారు. దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వంటి ప్రభుత్వాలను ఇప్పటి వరకు చూడలేదన్నారు. కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ, మతపర రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి కమ్యూనిస్టులకే ఉందన్నారు. రాష్ట్రంలో అమలు కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఆర్థిక పరిస్థితి బాగా లేదని చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నాడని ఆరోపించారు. ప్రజలను మభ్య పెట్టేందుకు విజన్–2047 అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్రానికి రూ.3 లక్ష కోట్లు ఆర్థిక సాయం ఇచ్చామని చెబితే.. చంద్రబాబు మాత్రం డబ్బులు లేవని చెబుతున్నారన్నారు. ఆ రూ.3 లక్షల కోట్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. గతంలో జగన్ సర్కార్ అప్పు చేసిందని ప్రచారం చేసిన మీరు.. నేడు అమరావతి పేరుతో వేల కోట్లు అప్పు తీసుకురావడం లేదా అని ప్రశ్నించారు.

ప్రభుత్వం అప్పుల్లో ఉందని ప్రజలపై భారం మోపుతారా?

– వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

రాష్ట్రం అప్పుల్లో ఉందని రాష్ట్ర ప్రజలపై కూటమి సర్కార్ ట్యాక్సులు, విద్యుత్ చార్జీల రూపంలో భారం మోపడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే ప్రజల్లో అసంతృప్తి వచ్చిందని, ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని, అయితే బీజేపీతో జతకట్టి కూటమి సర్కార్ ఏర్పడిన తర్వాతనే రాష్ట్రంలో మత విద్వేషాలు ఏర్పడ్డాయన్నారు. చంద్రబాబు దావోస్, సింగపూర్‌కు వెళ్లినా ఒక్క కంపెనీని తీసుకురాలేక పోయారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తే కంపెనీలు అవే వస్తాయన్నారు. పవన్ కల్యాణ్‌ను అడ్డు పెట్టుకుని బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని, టీడీపీ మనుగడ కూడా కోల్పోతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నష్టాల్లో ఉందని కార్మికుల జీతాలు కోత పెట్టే బదులు రాష్ట్రం అప్పుల్లో ఉందని ఎమ్మెల్యేలు, మంత్రులు జీతాలను త్యాగం చేస్తే బాగుంటుందన్నారు. అనంతరం సీపీఎం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, పుణ్యవతి, వెంకట్, మధు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు మూలం రమేష్, నాయకులు మోహన్‌రావు, చంద్ర రాజగోపాల్, వి వెంకటేశ్వర్లు, డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు, రెహానాబేగం, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన సీపీఎం నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విశాఖ ఉక్కు కాగడాను నేతలకు అందిస్తున్న బృందం



మహాసభకు హాజరైన సీపీఎం నేతలు, కార్యకర్తలు

ప్రగతి లేని బడ్జెట్

2025-26

కేంద్ర బడ్జెట్‌లో సింహపురి అభివృద్ధికి మొండిచేయి చూపించారు. కేంద్ర ప్రభుత్వంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కీలకంగా ఉండడంతో పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం లభిస్తుందని ఆశించిన వారికి భంగపాటు తప్పలేదు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రాజెక్టుల భవిష్యత్ ఊసెత్తకుండానే నిర్మలమ్మ పద్దు వెల్లడించారు. జిల్లా అభివృద్ధిలో కీలకమైన అనేక ప్రాజెక్టుల పురో'గతి' లేకుండా పోయింది.



- నిర్మలమ్మ 'పద్దు' మళ్లీ నిరాశే
- వట్టాలెక్కని నడికుడి – శ్రీకాళహస్తి లైన్
- దగదర్తి విమానాశ్రయం, బిట్రగుంటలో రైల్వే ప్రాజెక్టుల ఊసేలేదు
- రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అంతే
- కృష్ణపట్నంలో క్రిస్ సిటీ పరిస్థితిలో మార్పు లేదు
- ఎన్పీఈఆర్సీకే, తెలుగు అధ్యయన కేంద్రానికి మొండిచేయి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సువిశాలమైన సాగర తీరం వెంబడి ఏర్పాటవుతున్న పోర్టులు, రైల్, రోడ్డు, సీ కనెక్టివిటీ, అన్నింటికి మించి భూ సంపద, జల, మానవశక్తి వెరసి ఎన్నో రంగాల్లో అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్న జిల్లా నెల్లూరు. ఇప్పటికే ఎన్నో భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఉన్న జిల్లా పారిశ్రామిక రంగానికి అక్షయ పాత్ర వంటిది. కేంద్రం ప్రోత్సాహంతో వీటిని సద్వినియోగించుకుంటే జిల్లా పారిశ్రామికంగా స్వర్గధామం అవుతుందనడంలో సందేహం లేదు.

21 మంది ఎంపీలు ఉన్నా..

రాష్ట్రం నుంచి కూటమి ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వంలో 21 మంది ఎంపీల భాగస్వామ్యం ఉన్నప్పటికీ రాష్ట్రానికే కాదు.. జిల్లా ప్రాజెక్టులకు ఎలాంటి మోక్షం లభించలేదు. ఇటీవల ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిత్యం కేంద్ర మంత్రులను కలిసి సింహపురి సమస్యలపై విన్నవించినట్లు ఆర్భాటపు ప్రచారం చేశారు. జిల్లాలో మెట్ట ప్రాంత వాసుల జీవిత కలగా నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే మార్గం మిగిలిపోతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా.. అతీగతీ లేకుండా పోయింది. వెంకటాచలం మండలంలో ఏర్పాటు చేసిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రానికి రెండేళ్ల క్రితమే భవన నిర్మాణానికి భూములు కేటాయించినా.. నిధుల కేటాయింపులు జరగలేదు. ఎనిమిదేళ్ల కిందట శంకుస్థాపన చేసిన భారతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ప్రాంతీయ కేంద్రం నిర్మాణం అంతే. దగదర్తి విమానాశ్రయం నిర్మాణం, బిట్రగుంటలో రైల్వే ప్రాజెక్టుల ఊసే లేదు. మధ్యలో ఆగిపోయిన రామాయపట్నం పోర్టు, పూర్తయిన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పురోగతిపై ప్రస్తావనే లేదు. దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం ప్రారంభమైనా.. నిధులు లేక వసతి కరువై దివ్యాంగులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కొండాపురం మండలం చింతలదేవిలో జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం నిధులు లేక నీరసించిపోతోంది.

క్రిస్.. ష్..

కృష్ణపట్నం వద్ద 11,095 ఎకరాల్లో రూ.5,783.84 కోట్లతో క్రిస్ సిటీ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం అన్ని అనుమతులు సిద్ధం చేసింది. కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ పేరుతో టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ఎంఎస్ఎంఈ రంగాల పరిశ్రమలను ఇందులో ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధమైంది. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులో వస్తే 2.96 లక్షల మందికి ప్రత్యక్షంగా, 1.71 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి దక్కనుంది. అయితే ఈ ప్రాజెక్ట్ పురోగతి ఊసే లేదు.

పన్ను స్లాబులు దోపిడీకి పరాకాష్ఠ



రూ.12.75 లక్షల వరకు పన్ను లేదని చెప్పడం పెద్ద అబద్ధం. ప్రత్యక్ష ఆదాయం పొందే వర్గ ప్రయోజనాల కోసం పన్నుల విధానాన్ని రూపొందించాలి. ఉద్యోగులు అన్ని రకాల పన్నులు చెల్లిస్తుంటే మళ్లీ ఆదాయపు పన్ను వేయడం బాధాకరం. జీతానికి వృత్తి పన్ను చెల్లిస్తుండగా ఒకటిన్నర నెల ఆదాయపు పన్ను పేరుతో కట్టించుకోవడం దారుణం.

– మోహన్‌దాస్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు

విద్యకు తగినన్ని కేటాయింపులు లేవు



విద్యా రంగం అభివృద్ధి కావాలంటే జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ చెప్పినా.. ఆ పరిస్థితి లేదు. వేతన జీవులకు ఇన్‌కం ట్యాక్స్ డిడక్షన్ పెంపుదల అంకెల గారడీగా ఉంది. రూ.4 లక్షలకు మాత్రమే పెంచారు. రూ.12 లక్షల ఆదాయం కలిగిన వారిని కొంత ఊరట ఉన్నా.. మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు.

– చలపతిశర్మ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

వేతన జీవులు, విద్యారంగానికి ప్రాధాన్యం



ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ఆదాయ పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచడం భారీ ఊరట. దేశ బడ్జెట్ చరిత్రలో ఒకేసారి రూ.4 లక్షల వరకు ఆదాయ పన్ను లేని పరిమితి పెంచడం ఇదే ప్రథమం. ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్స్, ఇంటర్నెట్, ఐఐటీ, మెడికల్ సీట్లు పెంచడాన్ని స్వాగతిస్తున్నాం.

– రాజగోపాలాచార్యులు, అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, అపస్

వేతన జీవులకు భారీ ఊరట



బడ్జెట్‌లో వేతన జీవులకు కేంద్రం ఊరట కల్పించింది. చిన్న, చిన్న ఉద్యోగులకు కూడా ప్రభుత్వ పథకాలు వర్తించవు. విద్య, వైద్యం ఖరీదుగా మారింది. ఈ నేపథ్యంలో ఆదాయ పన్ను పరిమితి పెంచాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం రూ.12 లక్షల వరకు ఇన్‌కం ట్యాక్స్ మినహాయించడం మంచి పరిణామం.

– అల్లంపాటి పెంచలరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్ సంతృప్తికరంగా లేదు



కేంద్ర బడ్జెట్ సంతృప్తి కరంగా లేదు. కేంద్రంలో కీలకంగా ఉన్న ఏపీ కూటమి ప్రభుత్వం నిధులు సాధించడంలో వైఫల్యం చెందినట్టుగా ఉంది. బిహార్‌తో పోల్చి చూస్తే ఏపీకి కేటాయింపులు జరగలేదు. వ్యవసాయ రంగానికి ఆశించిన స్థాయిలో ప్రోత్సాహకాలు లేవు. మొత్తంగా చూసుకుంటే అసంతృప్తికర బడ్జెట్.

– గడ్డం తిరుపాల్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్, మహ్మదాపురం, పొదలకూరు

ఆశించిన స్థాయిలో ట్యాక్స్ రిబేట్ లేదు



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో గతంలో ఉన్న రూ.3 లక్షల వరకు ఫ్రీ ట్యాక్స్‌ను కేవలం రూ.4 లక్షలకు పెంచింది. రూ.8 లక్షల వరకు ఫ్రీ ట్యాక్స్ రిబేట్ ఉంటుందన్న ఆశలు వమ్మయ్యాయి. అనంతరం 5, 10 శాతం చొప్పున ఇన్‌కం ట్యాక్స్ పెంచారు. ఏది ఏమైనా ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులకు నిరాశే కలిగించింది.

– జీవీ నారాయణరావు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి, ఆత్మకూరు

రాష్ట్రానికి ప్రయోజనాలు నిల్



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నేరుగా ప్రయోజనాలు చేకూరేవి ఏవీ లేవు. రైతులకు ఏటా ఇచ్చే రైతు భరోసా నగదు పెంచుతారని ఆశగా ఉన్న రైతులకు ఆశాభంగమే జరిగింది. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడం, ప్రధానంగా ఆత్మకూరు నియోజకవర్గానికి కీలకమైన నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే మార్గం కలగా మిగిలింది.

– దగుమాటి కామాక్షమ్మ, మాజీ ఎంపీపీ, సంగం

పన్ను స్లాబులు మారలేదు



పాత ఆదాయ పన్ను స్లాబులు మార్చకపోవడం సామాన్య వేతన జీవులకు తీవ్ర నిరాశ. 50 వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు, డిజిటల్ శిక్షణ, ఐఐటీ కళాశాలల పెంపు, 75 వేలు మెడికల్ సీట్లు పెంచడం స్వాగతించాల్సిన అంశాలు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించాల్సి ఉంది.

– సురేంద్రరెడ్డి, ఏపీటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు

విశ్రాంత ఉద్యోగులకు కాస్త ఆశాజనకం



విశ్రాంత ఉద్యోగులకు కాస్త ఆశాజనకంగా కనిపిస్తుంది. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను ఉండదని ప్రకటించడం చూస్తే.. విశ్రాంత ఉద్యోగులకు వచ్చే పెన్షన్‌లో పన్ను రూపేణా కటింగ్ ఉండదని అర్థమవుతోంది. ఇన్నాళ్లకు విశ్రాంత ఉద్యోగులు కొంత వరకైనా వారికి వచ్చే పెన్షన్‌లో పన్ను మినహాయింపు పొందడం సంతోషం.

– ఎస్కే ఖాసిం, విశ్రాంత అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, నెల్లూరు

కేన్సర్ మందుల ధరలు తగ్గుతాయి



36 రకాల కేన్సర్ మందుల ధరలు తగ్గుతాయి. చిన్నపిల్లలకు వచ్చే కేన్సర్‌లకు, లంగ్ కేన్సర్‌లకు, సార్కోమా కేన్సర్‌ల మందులు తక్కువకు లభిస్తాయి. ప్రతి జిల్లా ఆస్పత్రిలో డే కేర్ కేన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది. దేశంలో కేన్సర్ రోగులు వేగంగా పెరుగుతున్నారు. దీని వల్ల ప్రభుత్వంపై కూడా భారం పడుతోంది.

– డాక్టర్ నాగేశ్వరరావు, సర్జికల్ ఆంకాలజిస్ట్, మెడికల్ సూపరింటెండెంట్, రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్

రైతులను నిరాశ పరిచిన బడ్జెట్



బడ్జెట్ రైతులకు నిరాశను మిగిల్చింది. ఒక పక్క మేలు అంటూనే చివరికి మభ్య పెట్టారు. విధి, విధానాలు, ఉపయోగాలు చెప్పకుండా రైతుల కోసం ధన, ధాన్య, కృషి యోజన ప్రవేశ పెట్టి 100 జిల్లాల రైతులకు ఉపయోగపడేలా చేస్తామన్నారు. 2 యూరియా పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. సిరిధాన్యాలు, పండ్లు తదితర పంటలను ప్రోత్సాహిస్తామన్నారు. రుణాలపై వడ్డీ రాయితీ రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచుతామన్నారు. అయితే అందుకు నిధులు కేటాయించలేదు. సబ్సిడీపై ఎరువులు అందిస్తామని చెప్పలేదు.

– చిరసాని కోటిరెడ్డి, రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



నగర వీధుల్లో రథయాత్ర కోలాహలం

- భక్తజనం.. ఆధ్యాత్మిక పారవశ్యం
- శ్రీకృష్ణ నామస్మరణతో పులకించిన నగరం

నెల్లూరు (బృందావనం): అశేష భక్తుల కోలాహలం నడుమ శనివారం సాగిన గౌర–నితాయ్ (జగన్నాథబలదేవ్) రథయాత్రతో సింహపురి భక్తిపార వశ్యంతో పులకించింది. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) నెల్లూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ శుకదేవ స్వామి పర్యవేక్షణలో నగరంలో చేపట్టిన 12వ రథయాత్ర ఆద్యంతం వేడుకగా జరిగింది. రథయాత్ర మూలాపేట అలంకార్ సెంటర్ దగ్గర ఉన్న శ్రీహనుమాన్ విగ్రహం నుంచి సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైంది. విశేషాలంకారంలో కొలువైన గౌర–నితాయ్, సుభద్రలకు డాక్టర్ శుకదేవస్వామి హారతులిచ్చారు. భక్తులు సంప్రదాయంగా గుమ్మడి కాయలతో దిష్టితీసి, కొబ్బరి కాయలు కొట్టారు. అనంతరం రథయాత్రను దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఇస్కాన్ మందిరాల నుంచి విచ్చేసిన నిర్వాహకులతోపాటు భక్తబృందం సంయుక్తంగా కలిసి జగన్నాథబలదేవ్ రథయాత్రను ప్రారంభించారు.

శ్రీకృష్ణ నామస్మరణతో సకలశుభాలు

పరమాత్ముడైన శ్రీకృష్ణ భగవానుని త్రికరణ శుద్ధిగా స్మరించడం ద్వారా సకల శుభాలు కలిగి, సమస్యలు తీరుతాయని ముంబయిలోని భక్తివేదాంత కాలేజీ ఆఫ్ వైదిక్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, బీబీటీ ఇండియా ట్రస్టీ ఇస్కాన్ మందిరం నిర్వాహకులు ఆచార్య హెచ్‌జీ వైష్ణవాంఘ్రి సేవక్ దాస్ తెలిపారు. ఇస్కాన్ చేపట్టే రథయాత్ర విశిష్టతను వివరిస్తూ ఉపన్యసించారు.



నృత్యాలతో ఆధ్యాత్మిక ఆనంద డోలికల్లో భక్తులు

భగవంతుని పట్ల ఆరాధన పెంచుకోవాలి

హోసూరు ఇస్కాన్ మందిరం నిర్వాహకులు హెచ్‌జీ శ్రీనివాస శ్యామ్ దాస్ మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల యాంత్రిక జీవనంలో విద్య, విజ్ఞానం, ఆదాయం పెరిగాయని అయితే భగవంతుని పట్ల ఆరాధన భావం, ఆధ్యాత్మిక చింతన తగ్గిందన్నారు.

రథయాత్ర వీక్షణం మహద్భాగ్యం

నెల్లూరు ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి ఉపన్యసిస్తూ జగన్నాథుడిని సేవించడం ద్వారా ఇహ పరలోక సుఖాలను పొందవచ్చన్నారు. రథంపై కొలువై ఉన్న జగన్నాథబలదేవ్, సుభద్రలను దర్శించుకోవడం మహద్భాగ్యమన్నారు.



భక్తుల కోలాహలం



విశేష అలంకరణలో జగన్నాథ్ బలదేవ్- సుభద్ర

ఇస్కాన్‌కు భూరి విరాళం

శ్రీకృష్ణభక్తులు, ఇస్కాన్ మందిరం సందర్శకులు గూడూరు రథయాత్ర నిర్వాహకులు శ్రీలక్ష్మి, మస్తాన్‌రావు దంపతులు నెల్లూరులోని ఇస్కాన్ మందిరానికి రూ.10 లక్షలు విరాళంగా ప్రకటించారు. గూడూరులోని తమకు చెందిన 132 అంకణాల స్థలాన్ని, ఇంటిని గూడూరులోని ఇస్కాన్ మందిరానికి దానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఝూన్సీకి చెందిన హెచ్‌జీ కరుణసింధుదాస్, చీరాలకు చెందిన హెచ్‌జీ కీర్తిరాజ్ దాస్, రాష్ట్రంలోని వివిధ జిల్లాలో ఉన్న ఇస్కాన్ మందిరాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వేడుకగా సాగిన రథయాత్ర

మూలాపేటలోని అలంకార్ సెంటర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర బారకాసు, పెద్దబజారు, చిన్నబజారు, ములుమూడి బస్టాండ్, సంతపేట, ఏసీ బొమ్మ సెంటర్, గాంధీబొమ్మ, వీఆర్సీ సెంటర్, ఏసీ కూరగాయల మార్కెట్ సెంటర్, ఆర్టీసీ బస్‌స్టేషన్ కూడలి నుంచి సర్వోదయ కళాశాల మైదానానికి చేరింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఇస్కాన్ మందిర స్వాములు భగవత్ సందేశాన్నిచ్చారు.

రథయాత్రకు సంఘీభావం

రథయాత్రకు గాంధీబొమ్మ కూడలి వద్ద మదీనావాచ్ కంపెనీ అధినేత షేక్ ఇంతియాజ్ సంఘీభావం తెలిపారు. ఇంతియాజ్‌ను రథయాత్ర నిర్వాహకులు జగన్నాథ బలదేవ్ సుభద్ర కొలువైన రథంపైకి ఆహ్వానించి అభినందలు తెలిపారు. రథయాత్ర వెంట ఆయన కొద్ది దూరం సాగారు.

నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి

నెల్లూరు(బారకాసు): మూన్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకం ఈఈఎల్‌టీపీ (ఎంప్లాయిబిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ అండ్ లైవ్‌లీహుడ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్) ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులకు, విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి కల్పించనున్నట్లు ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎస్‌కే రబియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్, డిగ్రీ, డిప్లొమా, ఇంటర్, పదో తరగతి పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9160838485, 0861–7961281 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

చిచ్చు రాజేసిన భూసేకరణ

గోప్యంగా సమావేశం నిర్వహణ

- నామమాత్రపు నష్ట పరిహారంతో సరి
- కూటమి ప్రభుత్వమొచ్చాక వింత నిర్ణయాలు
- భగ్గుమంటున్న గ్రామస్తులు



రసాభాసగా మారిన సమావేశం

కావలి: పాడి పంటలతో కళకళలాడుతూ.. ప్రశాంతంగా ఉంటున్న గ్రామంలో భూసేకరణ చిచ్చు రాజేసింది. పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ అంటూ కావలి రూరల్ మండలం ఆనెమడుగులో గ్రామసభను హడావుడిగా ఏర్పాటు చేశారు. ఇదే విషయాన్ని గ్రామంలో కొందరు టీడీపీ నేతలకు ముందే తెలియజేయడంతో వారు హాజరయ్యారు. దీనికి గ్రామస్తులు అంగీకరించరని తెలిసి, తామూ వ్యతిరేకమని గట్టిగా చెప్పేందుకు యత్నించారు. దీంతో సమావేశాన్ని అర్థాంతరంగా అధికారులు నిలిపేసి గ్రామం నుంచి నిష్క్రమించారు.

మొదట అనుకుంది ఇలా..

కావలి సమీపంలో నిర్మిస్తున్న రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలను స్థాపించాలనే ప్రతిపాదనలున్నాయి. చెన్నాయపాళెం, పెద్దపట్టపుపాళెం, ఆనెమడుగు, సర్వాయపాళెం పంచాయతీల్లో సుమారు ఐదు వేల ఎకరాలను సేకరించాలని గత ప్రభుత్వ హయాంలో కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. ఏపీఐఐసీ ద్వారా సేకరించి, దాని ద్వారా పరిశ్రమలను ఏర్పాటు చేసే వారికి అప్పగించాలని నిర్ణయించారు. ఈ మేరకు సర్వేనూ పూర్తి చేశారు. రైతులతో చర్చించి, వారి ఆమోదంతో నష్టపరిహారాన్ని చెల్లించి భూములను సేకరించాల్సి ఉంది.

ప్రభుత్వం మారాక పలు మార్పులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. భూసేకరణ ప్రక్రియను ఏపీఐఐసీకి కాకుండా మారిటైమ్ బోర్డుకు అప్పగించారు. దీనికి సంబంధించి కొందరు అధికారులను నియమించారు. వీరు టీడీపీ నేతల సలహా మేరకు నడుచుకుంటున్నారు. ఇందులో భాగంగానే ఆనెమడుగులో చాటింపు లేకుండా.. స్థానికులకు తెలియజేకుండా భూసేకరణపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

అంతా గోప్యం

గ్రామంలో మాగాణి, మెట్ట భూములు 2200 ఎకరాలున్నాయి. పరిశ్రమలు ఏర్పాటైతే గ్రామస్తులు, రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరుతుంది.. నష్ట పరిహారంగా ఎంత చెల్లిస్తామనే విషయాన్నీ స్పష్టంగా తెలియజేయాల్సి ఉంది. అయితే ఈ అంశాలను విస్మరించారు. గోప్యంగా వ్యవహరించి తాము ఎంపిక చేసుకున్న వ్యక్తులకే సమాచారమిచ్చి గ్రామసభను నిర్వహించామనే రీతిలో నడుచుకున్నారు.

పచ్చటి పొలాలు



భారీ విలువ.. ఇచ్చేది నామమాత్రమే

గ్రామంలో మాగాణి ఎకరా రూ.30 లక్షలకు పైమాటే. మెట్ట ఎకరా రూ.15 లక్షలు పలుకుతోంది. వీటిని విక్రయించే వారు గ్రామంలో లేరు. అయితే గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాగాణి భూమి ఎకరాకు రూ.11.9 లక్షలు.. మెట్టకు రూ.ఎనిమిది లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందించనుందని మారిటైమ్ బోర్డు అధికారులు ప్రకటించారు. అక్కడికి చేరుకున్న రైతులు తమ ప్రాణాలు పోయినా భూములను ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఫలితంగా గ్రామంలో అలజడి రేగింది.

సమావేశ విషయమే తెలియదు



భూసేకరణ కోసం గ్రామంలో అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్న విషయం ఎవరికీ తెలియదు. భూసేకరణ ప్రక్రియను రహస్యంగా జరపడం ఎలా కుదురుతుంది. మాగాణి, మెట్ట భూములే గ్రామస్తులకు జీవనాధారం. అరెకరా నుంచి రెండెకరాలు ఉన్న వారే అధికం. ఈ భూమితో వారికి ఎంతో అనుబంధం.

– సురేష్, ఆనెమడుగు

మా పొలాల ధరలు ఎంతనేది వారిష్టమా..?



తరతరాలుగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం. గ్రామంలోని మా పొలాలను ఎంతకు విక్రయించాలనే అంశాన్ని అధికారులెలా నిర్ణయిస్తారు. వీటిని విక్రయిస్తామని ఎవరూ చెప్పలేదు. అధికారుల పోకడ ఎంత వరకు సబబు.

– కొనంకి తిరుపతి, రైతు, ఆనెమడుగు

డిప్యూటీ మేయర్‌గా మైనార్టీ మహిళకు అవకాశం..?

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు డిప్యూటీ మేయర్ పదవిని మైనార్టీ మహిళకు కేటాయిద్దామని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారని తెలుస్తోంది. డిప్యూటీ మేయర్‌గా బరిలోకి ఎవర్ని నిలపాలనే అంశమై కార్పొరేటర్లతో సమావేశాన్ని నగరంలోని నారాయణ మెడికల్ కళాశాలలో శనివారం నిర్వహించారు. మైనార్టీ మహిళకు అవకాశమివ్వాలని తీర్మానించారని తెలుస్తోంది. 48వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ తహసీన్‌కు అవకాశం కల్పిద్దామని మంత్రి తెలిపారని సమాచారం.

డీసీఎమ్మెస్ బీఎం వెంకటస్వామి రాజీనామా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్మెస్) బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జేసీ కార్తీక్‌కు అందజేశారు. డీసీఎమ్మెస్‌కు బీఎంగా 2020 నుంచి ఆయన వ్యవహరిస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో నగదు తీసుకొని అనేక మందిని నియమించారనే అభియోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అవుట్‌సోర్సింగ్‌లో నియమితులైన వారందర్నీ ఇటీవల తొలగించారు. ఈ క్రమంలో రాజీనామా లేఖను జిల్లా సహకార శాఖ అధికారి గుర్రప్పకు అందజేయాల్సి ఉండగా, అలా కాకుండా నేరుగా జేసీకి సమర్పించడం విశేషం.

క్లుప్తంగా

భార్యపై దాడి.. ఆపై ఆత్మహత్య

మనుబోలు: భార్యపై దాడి చేసి.. ఆపై భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొలనకుదురులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గూడూరుకు చెందిన కొల్లపూడి ప్రతాప్ (35) కొలనకుదురుకు చెందిన భానును ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. గూడూరు రైల్వేస్టేషన్లో ఆహారాన్ని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొలనకుదురు వెళ్లి భార్యతో ఘర్షణపడి దాడి చేశారు. ఆమె అపస్మారక స్థితికి చేరుకోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా గాయపడిన భానును చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి స్థానికులు తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ శివ రామకృష్ణారెడ్డి, ఎస్సై శివరాకేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలను జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ మారుతిదేవి శనివారం చేపట్టారు. బిల్ బుక్‌లు, స్టాక్ రిజిస్టర్లు, గోదాములోని ఎరువుల నిల్వలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఎరువులను కొనుగోలు చేసే సమయంలో బిల్లులను తప్పక పొందాలని రైతులకు సూచించారు. ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. ఏఓ లక్ష్మి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- ఇద్దరికి తీవ్రంగా, ఒకరికి స్వల్ప గాయాలు

ఉదయగిరి: రోడ్డు మార్జిన్‌లో ఆపి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన ఘటన స్థానిక మద్యం షాపుల సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని మాసాయిపేటకు చెందిన సాయి, శివ, వెంకటేశ్వర్లు పని నిమిత్తం బైక్‌పై ఉదయగిరి వచ్చారు. అనంతరం బయల్దేరగా, రోడ్డు పక్కన ఆపి ఉన్న ట్రాక్టర్‌ను గమనించక వెనుక నుంచి ఢీకొన్నారు. ఘటనలో సాయి, వెంకటేశ్వర్లు తీవ్రంగా, శివ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని 108లో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు పంపారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటన కపాడిపాళెంలోని పెద్దబావి సెంటర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దబావి ప్రాంతానికి చెందిన ఓ యువతి తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటి గృహ ప్రవేశానికి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత భోజనానికి క్యారేజీ తీసుకొస్తానంటూ ఇంటికెళ్లారు. ఎంతకీ రాకపోవడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ఇంటికెళ్లిచూడగా ఆమె లేదు. ఫోన్ స్విచ్చాఫ్‌లో ఉంది. గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో సన్నిహితంగా ఉండేదని, ఆమె అదృశ్యం వెనుక అతని హస్తం ఉండొచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై సుల్తాన్‌బాషా దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించడంతో కుమార్తె పరార్

నెల్లూరు(క్రైమ్): ఫోన్లో ఎక్కువగా ఎందుకు మాట్లాడుతున్నావని తల్లి మందలించడంతో కుమార్తె ఇంటి నుంచి పరారైన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. దాడివారివీధిలో నివాసం ఉంటున్న ఓ మహిళ కుమార్తె నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతూ పరమేశ్వరినగర్‌లోని అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నారు. ఫోన్లో యువతి ఎక్కువగా శుక్రవారం మాట్లాడుతుండగా తల్లి మందలించారు. దీంతో కళాశాలకు శనివారం పంపలేదు. సాయంత్రం వరకు ఇంట్లోనే ఉన్న యువతి అక్కడి నుంచి అదృశ్యమయ్యారు. దీనిపై చిన్నబజార్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కుమార్తె అదృశ్యం వెనుక తమ ఇంటి పక్కనే ఉంటున్న ఫరూక్ ప్రమేయం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 120
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 240
లేయర్ చికెన్ : 145



పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10



వైస్ చైర్మన్ల ఎన్నికల్లో పోటీకి సిద్ధం



ప్రసన్నకుమార్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (బారకాసు): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో వైస్ చైర్మన్ల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థులు బరిలో ఉంటారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై కౌన్సిలర్లు, ముఖ్య నేతలతో డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో పార్టీ బీ – ఫారంపై గెలిచి, పార్టీ ఫిరాయించిన వారు తిరిగి గూటికి చేరి విధేయులుగా కొనసాగుతారో, ద్రోహులుగా మిగిలిపోతారో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని కాకాణి చెప్పారు. ధర్మానికి.. అధర్మానికీ జరగనున్న ఎన్నికల్లో అధర్మం తాత్కాలికంగా విజయం సాధించినా, తుది గెలుపు మాత్రం ధర్మానిదేనని పేర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల ఒత్తిడితో పార్టీ అధిష్టాన నిర్ణయం మేరకు పోటీలో అభ్యర్థులను నిలబెట్టేందుకు తమ పార్టీ సిద్ధపడుతుందని వెల్లడించారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



అల్లూరు: మండలంలోని ఇస్కపల్లి ఎస్టీ కాలనీలో గల మండల ప్రజాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విధులకు మూడు నెలలుగా రావడం లేదని ఆరోపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనను శనివారం వ్యక్తం చేశారు. వివరాలు.. పాఠశాలలో దాదాపు 35 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు చాలా కాలం నుంచి పాఠశాలకు రావడం లేదు. లీవ్ లెటర్‌ను సైతం అందజేయలేదని తెలుస్తోంది. ఈ పరిణామాలతో ఒక్క ఉపాధ్యాయుడే బోధించాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని వాపోయారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో శనివారం నిర్వహించిన పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు, ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబారయ్యారని పరీక్షల నిర్వహణాధికారి మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 164 మంది విద్యార్థులకు గానూ 45 మంది గైర్హాజరయ్యారు. జగన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబారయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలో 78 మందికి గానూ 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఏడుగురి గైర్హాజరు

వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన ఒకటో, నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 125 మందికి గానూ 118 మంది హాజరయ్యారని తెలిపారు.

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ



రాపూరు: మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి ఊంజల్‌సేవను కనులపండువగా శనివారం నిర్వహించారు. ప్రత్యేక పూజలను ఉదయం జరిపారు. తదుపరి ఉత్సవ విగ్రహాలను అలంకార మండపంలోకి తీసుకొచ్చి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నిర్వహించారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 54.58 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల నుంచి 150 క్యూసెక్కుల నీరొస్తోందని చెప్పారు. సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కెనాల్‌కు 170, మొదటి బ్రాంచ్‌కు 70 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

పేద విద్యార్థుల కోసం కార్పొరేట్ వసతులతో విద్యాసంస్థ

నెల్లూరు (టౌన్): పేద విద్యార్థుల కోసం అత్యున్నత ప్రమాణాలతో విద్యా సంస్థలను ప్రారంభించనున్నామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సంతపేటలోని ఆదర్శ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరులోని వీఆర్ కళాశాలలో రెండు వేల మందితో కార్పొరేట్ వసతులతో నర్సరీ నుంచి ఇంటర్ వరకు విద్యాబోధనకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతో పాటు యూనిఫాం, పుస్తకాలను ఉచితంగా అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీ

నెల్లూరు సిటీ: బైక్ చోరీకి గురైన ఘటనపై నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మాదరాజుగూడూరులోని పల్లిపాళెంలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు తన ప్యాషన్ ప్లస్ బైక్‌ను ఇంటి ముందు పది రోజుల క్రితం నిలిపారు. మరుసటి రోజు ఉదయానికి బైక్ అదృశ్యమైంది. చుట్టుపక్కల ఆరాతీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి

డెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.





కేలా రెనెకె
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

నేడు మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు

- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్-19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్-19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అబేధ్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తే లేదు!

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకె కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబొ మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్

- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4-1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్-4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

2-3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2-0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్-1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6-2, 6-1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6-0, 6-2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా


'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ- ''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ- ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.

-'దిల్' రాజు


'తంగలాన్'లో విక్రమ్


'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్


కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమేరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం


విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ- ''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.

- విష్ణువర్ధన్

సస్పెన్స్


ఆర్పీ పట్నాయక్, సురేష్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ-''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.

సూర్యాపేట్ నేపథ్యంలో....



ఈశ్వర్, నైనా

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ- ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.

ఓటీటీ — ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండి తెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

- ఇంటూరు హరికృష్ణ